క్లుప్తంగా

రైతు బీమాతో ధీమా



భీమ్‌గల్ : పురాణిపేట్ గ్రామానికి చెందిన తోట లక్ష్మి కొద్ది రోజుల కిందట గుండె పోటుతో మరణించింది. ఆమె భర్త తోట శంకర్‌కు రూ.5 లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీని ఆదివారం బీఆర్ఎస్ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్‌లు, సర్పంచ్ తోట శంకర్, ఎంపీటీసీ సాయి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అనాథల కోసం ఆశ్రమం



నందిపేట్(ఆర్మూర్): జోర్‌పూర్ శివారు ప్రాంతంలో ఆదివారం ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథల కోసం ఆశ్రమం ఏర్పాటు నిమిత్తం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మచ్చర్ల వినయ్ మాట్లాడుతూ.. అనాథలు, పేద పిల్లలు, వృద్ధుల కోసం ఆశ్రమ నిర్మాణం చేపడుతున్నామని, ఇందుకోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. జోర్పూర్ రాము, సర్పంచు బాబారావు, నందిపేట ఉప సర్పంచు భరత్, మచ్చర్ల చిన్నసాయన్న, జోర్‌పూర్ వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

పంచ శతక ధారణ సభ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పంచ శతక ధారణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బెజుగామ రామమూర్తి రచించిన మధుర సూక్తులు శతకం, తల్లావజ్జల మహేష్ బాబు రచించిన పొడుపు విడుపు, పబ్బ మురళి రచించిన మురళి శతకం, కాసర్ల నరేశ్ రావు రచించిన వానచుక్క శతకం, గంట్యాల ప్రసాద్ రచించిన ఓటరన్న శతకములను ధారణ చేశారు. పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఐదు నీతి శతకాలలోని 540 పద్యాలను వరుస క్రమంలో కంఠత రాగయుక్తంగా పాడి అబ్బుర పరిచారు. పంచ శతక ధారణ సభకు ముఖ్య అతిథిగా హాజరైన పబ్బ మురళి శతక పఠనాన్ని పరిశీలించి విద్యార్థులను అభినందించారు. బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ఓరియంటెడ్‌గా ఉండాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థుల భవిష్యత్తుకు మొదటి మలుపు అయిన ఇంటర్మీడియట్ విద్య తర్వాత ఎంచుకునే కోర్సులు కెరీర్ ఓరియంటెడ్‌గా ఉండాలని మోటివేషనల్ స్పీకర్ రాచకొండ చంద్రశేఖర్ అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఎడ్యుకేషనల్ సొసైటీ, అల్జాపూర్ రాజేశ్వర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉన్నత విద్య- దిశ నిర్దేశాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్ వ్యాఖ్యాత వంగ శ్రీహరి మాట్లాడుతూ.. కెరీర్‌లో ఎలా సఫలీకృతం కావాలో వివరించారు. సొసైటీ చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ నాగేశ్వర్ రావు, వైస్ ప్రిన్సిపల్ బండారి నరేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



ఆర్మూర్ టౌన్: విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో కష్టపడి చదివి రాయాలని ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు అన్నారు. పట్టణంలోని శ్రీ గాయత్రి కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు పాల్గొని పరీక్ష పత్రాలను ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ ప్రముఖ విద్యావేత్త ఐఐటీ చుక్కారామయ్య ఆధ్వర్యంలో ఈ పరీక్ష పత్రాలను తయారు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రతిభ పరీక్షల్లో రాసి తమ సత్తాను నిరూపించుకోవాలని కోరారు. టాలెంట్ పరీక్షల్లో మొత్తం 370 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గాయత్రి కళాశాల కరస్పాండెంట్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్టీసీ కాలనీ

- ఎటూ కదలని మురికి నీరు
- డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- సమస్య పరిష్కారం కోసం ఎదురు చూపులు



ఆర్టీసీ కాలనీలో ఇళ్ల పక్కన ఖాళీ స్థలాల్లో నిలిచిన మురికి నీరు



మడుగులు కట్టిన మురికి నీరులో పెరుగుతున్న పిచ్చి మొక్కలు

మాక్లూర్: ఆర్టీసీ కాలనీలోని 3వ డివిజన్ పరిధిలో డ్రైనేజీలు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి నీరంతా మడుగులు కట్టి దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అంతే కాకుండా పలు చోట్ల రహదారిపై మురికి నీరు పారుతుంది. సమస్య పరిష్కారానికై ప్రజావాణిలో నెల రోజుల క్రితం స్థానికులు ఫిర్యాదు చేశారు. సంబంధిత మున్సిపల్ ఈఈ, ఏఈ కాలనీకి వచ్చి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పినా ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సమస్య మరింత పెరిగి మురికి నీరంతా ఒక చోట చేరి చిన్న చెరువులను తలపిస్తున్నాయి. దోమలు పెరిగి, దుర్వాసన కూడా వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మురికి నీరు నిలువకుండా డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

డ్రైనేజీ నిర్మాణ విషయమై చాలా సార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు వచ్చి పరిశీలించి వెళ్తున్నారే తప్ప పనులు చేపట్టడం లేదు. ఇదిగో అదిగో అంటూ ఆలస్యం చేస్తున్నారు. మేము దోమల బారిన పడి మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు గురవుతున్నాము. అంతే కాకుండా మురికి నీరుతో ఏర్పడిన మడుగుల నుంచి దుర్వాసన వస్తుంది. ఇంట్లో ఉండలేకపోతున్నాం. అధికారులు స్పందించి డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టాలి.

– రాజేందర్, కాలనీ అధ్యక్షుడు, ఆర్టీసీ కాలనీ

గంజాయి సూత్రధారులను పట్టుకోండి



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో గంజాయి విక్రయాల వెనకు ఉన్న అసలు సూత్రధారులను పట్టుకోవాలని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడం కోసం గంజాయి కేసులను ఎరగా వాడుతున్నారని ఆరోపించారు. ఆదివారం మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో సునీల్‌రెడ్డి మాట్లాడారు. ముప్కాల్‌లో ఇద్దరు అధికార పార్టీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక నాయకుడి పిల్లలపై గంజాయి కేసును నమోదు చేయడం తన ఆరోపణలకు నిదర్శనం అన్నారు. గంజాయిపై తాను మూడేళ్లుగా పోరాటం చేస్తున్నానని అయినా ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోలేదన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి తన స్వార్థ రాజకీయాల కోసం బాల్కొండ నియోజకవర్గంలో శాంతికి విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు



బోధన్: బోధన్ పట్టణ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 70వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్, పలువురు చిరువ్యాపారులు కూర్చున్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, న్యాయవాదులు కులకర్ణి దత్తాత్రిరావు, అర్జున్‌రాం డార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

భీమ్‌గల్: లింగాపూర్ గ్రామానికి చెందిన అభిరామ్ తేజ్ ఆత్మహత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్కన్నగారి మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో బీజేపీ నాయకులు మల్కన్న గారి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కొంత మంది అభిరామ్ తేజ్‌ను ఇష్టం వచ్చినట్లు కొట్టి, భయభ్రాంతులకు గురి చేశారని, బలవంతంగా ఒప్పంద పత్రం రాయించుకోవడం వల్లనే తీవ్ర మనస్తాపానికి గురై అభిరామ్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. నిందితులను అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ములిగె మహిపాల్, నిమ్మల శ్రీనివాస్, కనికరం మధు పాల్గొన్నారు.

రోడ్డుపై అక్రమ నిర్మాణాలను నిలిపేయాలి



రుద్రూర్(కోటగిరి) : కోటగిరి పోలీస్ స్టేషన్ పక్క నుంచి ప్రభుత్వ ఆస్పత్రి, వ్యవసాయ పొలాలకు వెళ్లే దారి కబ్జాకు గురవుతున్నదని, ఇక్కడ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. వివాదంగా ఉన్న ప్రాంతాన్ని ఆదివారం సీపీఐ నాయకులు సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ మార్గంలో అక్రమంగా రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో పాటు కోటగిరి శివారులో గల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి ఎన్ని ఎకరాలు ఉన్నదో, వాటి సర్వే నెంబర్లను తెలియజేసే నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలని వారు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు.

బీజేపీ నేతల ఆరోపణలను ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణ నాయకులు

బోధన్: జిల్లా ఎమ్మెల్సీ కవిత, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్‌లపై బీజేపీ పట్టణ నాయకులు చేసిన అవాస్తవ, నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు రవి శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో నాయకులతో కలిసి మాట్లాడారు. ఇసుక మాఫియా వెనుక ఎమ్మెల్యే ఉన్నాడని చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, బీజేపీ నాయకులే ఇసుక దందాలో భాగస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. బోధన్‌లో శివాజీ విగ్రహం ఏర్పాటు విషయంలో మున్సిపాలిటీలో తీర్మానం చేయించేందుకు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి, తదితరులు కృషి చేశారని గుర్తు చేశారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భీమ్‌గల్: మండలంలోని పిప్రి, పల్లికొండ, పురాణిపేట్ గ్రామాల్లో జెడ్పీటీసీ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు జెడ్పీటీసీ చౌటపల్లి రవి ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య ఉన్నారు.

వైకుంఠధామానికి దారేది?



పురాణిపేటలో దారి లేని వైకుంఠధామం

భీమ్‌గల్: వైకుంఠధామాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఉండాలి. బాధతో అలసిపోయిన కుటుంబ సభ్యులు కొద్ది సేపు కూర్చోవడానికి మంచి వాతావరణం కల్పించాలి.. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పలు గ్రామాల్లో వైకుంఠధామాల ప్రారంభోత్సవాలప్పుడు చెప్పిన మాటలు. పచ్చని పంట పొలాల కంటే మంచి వాతావరణం ఎక్కడ ఉంటుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు అనుకున్నారేమో ఎలాంటి దారి ఏర్పాటు చేయకుండానే పచ్చని పంట పొలాల మధ్య వైకుంఠధామ నిర్మాణం చేపట్టారు. లక్షలాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన వైకుంఠధామం నిరుపయోగంగా మారిన ఘటన పురాణిపేట్‌లో చోటు చేసుకుంది. ప్రభుత్వం ప్రతి ఊరిలో వైకుంఠధామ నిర్మాణానికి సుమారు రూ.12 లక్షల కేటాయించింది. పురాణిపేట్‌లో వైకుంఠధామం నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకొని వైకుంఠధామానికి దారి చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దారి ఏర్పాటు చేయిస్తాం



ఇప్పుడు వైకుంఠధామం చుట్టూ వరి పైరు ఉంది. వరి పంట కోయగానే దారి ఏర్పాటు చేయిస్తాం. భవిష్యత్‌లో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్వర్, ఎంపీడీవో

ఆర్థిక సహాయం



భీమ్‌గల్: జాగిర్యాల్ గ్రామానికి చెందిన వాల్గోట్ లక్ష్మీ నారాయణ తన కూతురు వివాహని ఆర్థిక, వస్తు సహాయం చేయాలని శ్రీ లక్ష్మీ చేయుత సేవా సమితి ప్రతినిధులను కోరారు. శ్రీ లక్ష్మీ చేయుత సేవా సమితి ప్రతినిధులు వెంటనే స్పందించి రూ.10 వేల ఆర్థిక సహాయంతో పాటు ఇతర సామాగ్రిని ఆదివారం జాగిర్యాల్‌లోని వారి ఇంటి వద్ద అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వంగల రమణ చారి, సెక్రెటరీ లక్ష్మణ్‌పాల్గొన్నారు.

వర్నిలో గర్భిణులకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో భాగంగా ఆర్యజనని బుక్స్ ప్రదర్శిస్తున్న మహిళలు

– రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మార్గదర్శనం

రుద్రూర్: వర్ని మండల కేంద్రంలోని మల్లారెడ్డి మెమోరియల్ స్కూల్‌లో ఆదివారం రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో గర్భిణులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఓ మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్ల వయసు వచ్చే వరకు పాటించవలసిన సూచనలను డాక్టర్ అంజలి వివరించారు. ప్రసవానికి ముందు యోగా, గాఢమైన విశ్రాంతి, శ్వాసించడం, ధ్యానానికి సంబంధించిన శక్తిమంతమైన చిట్కాలను తెలియజేశారు. కార్యక్రమంలో యోగ నిపుణులు దీప్తి, సామాజిక కార్యకర్తలు నారాయణ రావ్, మాధురి పాల్గొన్నారు. వర్క్ షాప్‌నకు కోటగిరి, వర్ని మండలాల నుంచి గర్భిణులను వాహనాల్లో తరలించారు.

ప్రారంభోత్సవానికి విఠలేశ్వర ఆలయం సిద్ధం



రుద్రూర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఆలయ కమిటీ, పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ఆరేళ్ల శ్రమించి ఎట్టకేలకు మందిరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మార్చి 1,2,3తేదీల్లో ఆలయాన్ని పునః ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాతి కట్టడంతో వెలిసిన విఠలేశ్వర స్వామి ఆలయం చాలా పురాతనమైనది. ఈ ఆలయంలోనే శ్రీ సార్వజనిక్ గణేష్ మండలి వినాయకుడి ఉత్సవాలు 60 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. ఆలయం జీర్ణోద్ధారణ కావడంతో పునర్నిర్మాణం చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఉత్సవానికి ముఖ్య అతిథిగా అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వస్తున్నారు.



రుద్రూర్‌లో పునర్నిర్మించిన విఠలేశ్వర స్వామి ఆలయం

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ బాల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆశ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ జనరల్ సర్జన్ వేముల బాల్‌రెడ్డి నేతృత్వంలో వైద్య బృందం పాల్గొని 553 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో, రక్త పరీక్షలతో పాటు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్వగ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య సేవలందించినందుకు తనకు సంతృప్తినిచ్చిందని డాక్టర్ వేముల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ఎంపీటీసీ సుధాకర్, వీడీసీ అధ్యక్షుడు బద్ద రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

సమాన హక్కుల కోసం పోరాడాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పుట్ట లక్ష్మి తదితరులు

బోధన్: సమాన హక్కులు, అవకాశాల కోసం మహిళలు సంఘటితంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పుట్ట లక్ష్మి పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధిని ఉద్దేశపూర్వకంగానే దెబ్బతీస్తూ స్త్రీ, పురుష అసమానత్వాన్ని పెంచి పోషించే పితృస్వామిక పాలనను వ్యతిరేకించాలని పేర్కొన్నారు. ఆదివారం బోధన్ పట్టణ కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ ఆఫీసులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్లను సంఘ ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ సావిత్రి, పీవోడబ్ల్యూ ప్రతినిధులు అనిత, నిఖిల, పద్మ, అబ్బవ్వ, గంగవ్వ, లావణ్యలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయండి



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నేత గోదావరి

ఆర్మూర్: ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోదావరి డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆర్మూర్ డివిజన్ కార్యవర్గ సమావేశం కామ్రేడ్ సత్యక్క అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాధన ఉద్యమంలో మహిళల పాత్ర ఎనలేనిదన్నారు. గత ప్రభుత్వాలు మహిళలకు 25 పైసల వడ్డీలు ఇచ్చాయని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడితే రూ.10లక్షల వరకు వడ్డీ లేకుండా రుణాలు ఇస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ కేసీఆర్ ఇచ్చిన హామీ నీటి మూటైందని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలను మోసగిస్తున్న ప్రభుత్వంపై వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు.

సమాచారం..

నేడు బోధన్ బల్దియా బడ్జెట్ సమావేశం

బోధన్‌టౌన్(బోధన్): బల్దియా బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని, వివిధ పార్టీల కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

మెండోరా సర్వ సభ్య సమావేశం

బాల్కొండ: మెండోరా మండల సర్వ సభ్య సమావేశం సోమవారం ఎంపీపీ బురుకుల సుకన్య అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభమవుతుందన్నారు.

10న రుద్రూర్ మండల సర్వసభ్య సమావేశం

రుద్రూర్: రుద్రూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల 10న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాల గంగాధర్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ అక్కపల్లి సుజాత అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. 6వ తేదీ లోపు అధికారులు తమ శాఖాల ప్రగతి నివేదికలు మండల పరిషత్ కార్యాలయంలో అందచేయాలని కోరారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుని వార్షికోత్సవాలు

బాల్కొండ: వన్నెల్(బి)లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరుని 24వ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.